# బచావత్ తరువాత : ఒక ప్రతిపాదన

**బ**చావత్ అవార్డు గడువు తీరిపోయి ఒక సంవత్సరం కావస్తున్నది. కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలు ఏ ప్రాతిపదికపైన పంచుకోవాలో చెప్పిన అవార్డు బచావత్ అవార్డు. ఆ అవార్డు గడువు తీరిపోయేంతవరకు మూడు రాష్ట్రాలు దానికి కట్టుబడి ఉండాలి. ఏ రాష్ట్రమయినా దానిని ఉల్లంఘిస్తే తక్కిన రెండు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో కేసు వేయవచ్చు. సుప్రీంకోర్టు తగురీతిలో అవార్డును అమలు చేయించగలదు. 'ఆల్మట్టి' విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంపైన సుప్రీంకోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే.

అవార్డు గడువు దాటిపోయిన తరువాత, వాళ్లే కొత్త ఒప్పందం చేసుకునేంతవరకు మూడు రాష్ట్రాలు పాత అవార్డుకు కట్టుబడి ఉండడం ఒక సత్‌సంప్రదాయం. అయితే శాశ్వతంగా అదే అవార్డును కొనసాగించనక్కర లేదు. కొత్త ఒప్పందం చేసుకోవచ్చు. చర్చల ద్వారా అది సాధ్యం కానట్టయితే కేంద్ర ప్రభుత్వానికి అర్జీపెట్టుకొని అంతరాష్ట్ర జల వివాదాల చట్టం కింద మరొక ట్రిబ్యునల్‌ను (బచావత్ ట్రిబ్యునల్ లాంటిది) నెలకొల్పమని అడగవచ్చు. ఈ సంవత్సర కాలంలో ఇవి రెండూ జరగలేదు.

బచావత్ ట్రిబ్యునల్ గడువు తీరిపోయిన వెంటనే, కొత్త ఒప్పందానికి తాను సిద్ధమేనని కర్ణాటక ముఖ్యమంత్రి ప్రకటించాడు. తరువాత దానిని పునరుద్ఘాటించాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అటువంటి ప్రకటన చేశాడు.

మళ్లీ ఇంకొక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసుకొనే బదులు మూడు రాష్ట్రాలూ చర్చల ద్వారా ఒప్పందం ఏర్పరచుకోవడమే మేలయిన పద్ధతి. న్యాయమూర్తులు సాంకేతిక సంప్రదాయాలకు, వ్యక్తిగత ఆస్తి తగవుల పరిష్కారం కోసం పుట్టిన సివిల్ చట్టాల న్యాయశాస్త్ర సూత్రాలకూ బానిసలు. ఉమ్మడి ప్రజావసరమైన నదీజలాల పంపకం పరస్పర అవగాహనతో కూడిన ఇచ్చిపుచ్చుకునే వైఖరితో జరగడమే సరయిన పద్ధతి కాబట్టి అది న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కాక సంబంధిత ప్రజలు, ప్రభుత్వాల మధ్య చర్చల రూపంలో జరగడమే మంచిది.

అందువల్ల కర్ణాటక ముఖ్యమంత్రి ప్రకటనకు మన ముఖ్యమంత్రి స్పందించి వుంటే బాగుండేది.

కానీ ఈయన సంవత్సరం గడిచినా మాట్లాడడం లేదు. దీనికి రెండు కారణాలు వుండవచ్చు. బచావత్ అవార్డు పట్ల ఆంధ్రప్రదేశ్‌కు వున్న సదభిప్రాయం మొదటి నుండీ కర్ణాటకకు మహారాష్ట్రకూ లేని సంగతి తెలిసిందే. ఆ అవార్డు తమకు పూర్తి న్యాయం చేయలేదని వారి అభిప్రాయం. ఆ అభిప్రాయం న్యాయమైనదా అన్యాయమైనదా అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. ఆ అభిప్రాయం వుండబట్టే కర్ణాటక, మహారాష్ట్రలు బచావత్ గడువు తీరిపోయిన వెంటనే కొత్త ఒప్పందానికి సిద్ధమని ప్రకటించి వుండవచ్చును. ఆ కారణంగానే మన ముఖ్యమంత్రి స్పందించకుండా వున్నాడేమో. ఊరుకుంటే 'మనకు' అనుకూలంగా వున్న బచావత్ తీర్పే అమలవుతూ వుంటుందనుకుంటున్నాడేమో.

లేదా, కృష్ణానది నీటి వినియోగం సమస్యను మళ్లీ చర్చకు పెడితే తీగలాగితే డొంకంతా కదిలినట్టు రాష్ట్రం లోపల ఆ నది నీటి పంపకంలో జరిగిన అన్యాయం చర్చకొస్తుందని భయపడుతున్నాడేమో.

కారణమేదైనా, మన ప్రభుత్వం మౌనం సరయినది కాదు. కర్ణాటక ప్రతిపాదనకు మన ప్రభుత్వం స్పందించి, మూడు రాష్ట్రాలూ కృష్ణానది నీటి వినియోగం గురించి కొత్త ఒప్పందం చేసుకోవాలని మనం కోరవలసి వుంది. ఇది కేవలం ప్రభుత్వాల మధ్య ఒప్పందం కానక్కరలేదని దిగువన చూద్దాం. అయితే కొత్త ఒప్పందం ఎందుకు చేసుకోవాలి? బచావత్ తీర్పులో ఏం లోపం వుంది? దానినే శాశ్వతంగా కొనసాగనిస్తే వచ్చిన నష్టమేముంది?

బచావత్ ట్రిబ్యునల్ కృష్ణానదీ జలాల వివాదం పరిష్కారం కోసం అనుసరించిన పద్ధతిలో మూడు లోపాలున్నాయి. అందులో రెండు ట్రిబ్యునల్ ఎంచుకున్న పద్ధతి నుండి పుట్టాయి. మూడవది అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టంలోనే వుంది. ఆ చట్టం అంతర్రాష్ట్ర నదుల నీటి విషయంలో తలెత్తే వివాదాల్ని 'రాష్ట్రాల' మధ్య వివాదాలుగానే పరిగణిస్తుంది. 'రాష్ట్రాల' ప్రాతిపదికనే పరిష్కరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే ఆ చట్టం కింద నెలకొల్పే ట్రిబ్యునల్ ముందు వాది-ప్రతివాదులు. ఆయా రాష్ట్రాలలోని ప్రాంతాల మధ్య వున్న వివాదాలు లెక్కలోకి రావు. అన్ని ప్రాంతాలకూ రాష్ట్ర ప్రభుత్వమే ప్రతినిధి అని ఆ చట్టం భావిస్తుంది.

కాగా, మిగిలిన రెండు లోపాలు జస్టిస్ బచావత్ ఎంచుకున్న పద్ధతి నుండి వచ్చాయి. బచావత్ ట్రిబ్యునల్ కృషిని కించపరచడం మా ఉద్దేశ్యం కాదు. తనముందు ఉంచిన కర్తవ్యాన్ని జస్టిస్ బచావత్ చాలా ఓర్పుతోనూ నేర్పుగానూ నిర్వర్తించారు. ఆయన తీసుకున్న శ్రమ, ప్రదర్శించిన వివేచన ఆ నివేదిక చదివితే అర్థం అవుతుంది. అయినప్పటికి అందులో రెండు ప్రధాన లోపాలున్నాయని గుర్తించక తప్పదు. అవి రెండూ కూడా ఈ మూడు రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాలకు నష్టం చేశాయి.

ఒకటి, నది నీటిని నికర జలాలు - మిగులు జలాలు అని వర్గీకరించి మిగులు జలాలకు కేటాయింపు వుండదని తీర్మానించడం. నిజానికి నికరజలం నికరమూకాదు; మిగులు జలాలు భావనాపరంగా తప్ప వేరే ఏ అర్థంలోనూ మిగులుకాదు.

రెండు, వివాదం తన ముందుకొచ్చేసరికి స్థిరపడిపోయిన నీటి హక్కులకు భంగం కలిగించ కూడదని భావించడం. ఈ వైఖరి ఆయన జడ్జి కావడం వల్ల వచ్చిందనడంలో సందేహం లేదు. ఒక ఆస్తి తగాదా కోర్టు ముందు కొచ్చినప్పుడు, అప్పటికే స్థిరపడిపోయిన హక్కులకు భంగం

కలిగించకూడదని బూర్జువా సివిల్ చట్టం భావిస్తుంది. నీళ్ళు వ్యక్తిగత ఆస్తికాదు కాబట్టి దానికి ఈ సూత్రం వర్తింపజేయడం న్యాయం కాదు. ఈ మూడు లోపాలనూ కొంచెం పరిశీలించి ఇప్పుడేం చేయాలో మాట్లాడుకుందాం.

## 1. నికర జలాలు – మిగులు జలాలు

మూడు రాష్ట్రాల అవసరాల కోసం కృష్ణానదీ జలాలను ఏవిధంగా పంపిణీ చేయాలని నిర్ణయించే ముందు అసలు కృష్ణానదిలో ఏ సంవత్సరమైనా నీళ్లెంత లభ్యమవుతుందో తెలుసుకోవాలని గుర్తించిన జస్టిస్ బచావత్ ఆ పనికి పూనుకున్నారు. మనకు ఈనాటికీ వుపయోగపడే సమాచారాన్ని సేకరించారు. 100 సంవత్సరాల సమాచారాన్ని సేకరించి, 75% సంవత్సరాలలో (అంటే నాలుగు సంవత్సరాలలో మూడింటిలో) కృష్ణానదిలో 2060 టిఎంసిల నీరుంటుందని గుర్తించారు. ఆ 2060 టిఎంసిల నీటిని 'నికరజలాలు' అన్నారు. దానిని మాత్రమే ప్రాజెక్టులకు కేటాయిస్తామన్నారు. ఏ సంవత్సరమైనా అంతకంటె ఎక్కువ నీరు కృష్ణానదిలో వుంటే దానిని 'మిగులు జలాలు'గా భావించాలన్నారు. దానిని ప్రాజెక్టులకు కేటాయించేది లేదనీ, వున్న ప్రాజెక్టుల ద్వారా దానిని వాడుకోవచ్చుననీ (ఆ హక్కు కూడ ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఇచ్చారు) లేకపోతే అది సముద్రంలోకి పోవలసిందే అన్నారు.

ఒక ప్రాజెక్టు కడితే దాని ఆయకట్టు దార్లయిన రైతులకు నీరు లభిస్తుందని ఆశిస్తారు. కాబట్టి కచ్చితంగా నీళ్ళుంటేనే ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని భావించడం సబబేననుకుందాం. కానీ బచావత్ ట్రిబ్యునల్ 'నికరజలాలు' అని తేల్చిన 2060 టిఎంసిలు మాత్రం ఏ సంవత్సరమయినా కచ్చితంగా లభిస్తుందని ఎవరైనా భరోసా ఇయ్యగలరా? '75% సంవత్సరాలలో లభిస్తుంది' అని సంతృప్తి కోసం చెప్పవలసిందేగానీ '2001-02 సంవత్సరంలో నా నీళ్లు నాకొస్తాయా' అని ఏ రైతు అడిగినా అవునని ఎవరూ అనలేరు. అప్పుడు ఈ భావన వల్ల ఒరిగిందేమిటి? మిగిలిన 25 శాతాన్ని సముద్రంలోకి పోనివ్వడం తప్ప?

పైగా, 75% అన్న ప్రమాణం ఎందుకు ఎంచుకున్నట్టు? దానికి ప్రత్యేకమైన కారణమేమీ లేదు. 80 లేక 85% ఎంచుకొని వుంటే ఇంకా తక్కువ ప్రాజెక్టులకు అనుమతి లభించేది. కానీ లభించిన వాటి ఆయకట్టుదార్లకు మరింత ఎక్కువ నీటి గ్యారంటీ వుండేది. 60 లేక 65% శాతం ఎంచుకొని వుంటే ఇంకా ఎక్కువ ప్రాజెక్టులకు అనుమతి లభించి వుండేది. లభించిన వాటి ఆయకట్టుదార్లకు నీటి గ్యారంటీ తక్కువ వుండేది.

నీటిని వృథాగా సముద్రంలోకి పోనీయడం కంటే, తక్కువ గ్యారంటీ వున్నా ఎక్కువ ప్రాజెక్టులకు అవకాశం ఇచ్చే నిర్ణయమే ఎందుకు మెరుగనుకోకూడదు? నీటి గ్యారంటీ అన్ని ప్రాజెక్టుల ఆయకట్టుదార్లకూ ఒకే మోతాదులో అవసరం వుండదు. వర్షపాతం సహజంగానే ఎక్కువ వుండే ప్రాంతాలలో రైతాంగానికి ప్రాజెక్టు నీటి వల్ల అదనపు వుపయోగం వుంటుందే తప్ప అది జీవిత అవసరం కాదు. కరువు ప్రాంతాలలో వుండే ప్రాజెక్టుల పరిస్థితి అందుకు విరుద్ధం.

కాబట్టి నికరజలాలు–మిగులు జలాలు అనే కృత్రిమమైన వర్గీకరణను విడిచిపెట్టి, 60 లేక 50 శాతం నీటి లభ్యత ప్రాతిపదికన ప్రాజెక్టులు కట్టుకొని (ఇంకా తక్కువ కూడ కావచ్చు) ఏ సంవత్సరమైనా మొదట నదిలోకి వచ్చే నీళ్ళు కరువు ప్రాంతాలలో వుండే ప్రాజెక్టులకు పారించడం

ద్వారా ఆ ప్రాజెక్టుల ఆయకట్టుదార్లకు ఎక్కువ గ్యారంటీ, వర్షాభావం లేని ప్రాంతాల ప్రాజెక్టులకు తక్కువ గ్యారంటీ ఇవ్వడంలో తప్పేముంటుంది?

## 2. అప్పటికే నెలకొన్న హక్కులను కాపాడడం

కృష్ణానదీ జలాలపైన కోస్తా ఆంధ్ర జిల్లాలు కొన్ని చారిత్రక, రాజకీయ కారణాల వల్ల ఏనాడో హక్కులు పొంది వున్నాయి. వారు ఆ హక్కులు పొందినప్పుడు నదీజలాల పంపిణీకి సంబంధించిన చట్టంగానీ అవార్డుగానీ ఒప్పందంగానీ ఏదీలేదు. ఇతర ప్రాంతాల అవసరాల గురించి ఎవరూ అడగలేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టయితే అప్పటి మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాల అభ్యంతరాలు నడుమ నిర్మించారు.

ఈవిధంగా నెలకొన్న హక్కులను శాశ్వతమైనవిగా గౌరవించవలసిన అవసరం లేదు. కానీ జస్టిస్ బచావత్ ఆ విధంగా భావించడం వల్లనే కృష్ణానదీ జలాలలో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ వాటా వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా ఆంధ్రకు ఎక్కువ వాటా వచ్చింది. బచావత్ అవార్డు '75 శాతం లభ్యత' ప్రాతిపదికన నిర్ధారించిన 2060 టిఎంసిల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 800 టిఎంసిలు, కర్ణాటకకు 695, మహారాష్ట్రకు 565 వచ్చిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ వాటా అయిన 800 టిఎంసిల నీటిలో 377.7 టిఎంసిలు కోస్తా ఆంధ్రకు, 266.8 తెలంగాణకూ, 122.7 రాయలసీమకూ వచ్చిన సంగతి కూడ తెలిసిందే. నిజానికి తెలంగాణలో అప్పటికే వాడకంలో వున్నట్టు ట్రిబ్యునల్‌కు లెక్కజూపిన ఊహాత్మక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను కనుక మినహాయిస్తే తెలంగాణ వాటా అంతకూడ లేదు. కృష్ణానది అత్యధికంగా ప్రవహించేది మహబూబ్‌నగర్ జిల్లాలో. అయితే నల్లగొండ, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు కూడా కృష్ణానదీ జలాలపైన ఆధారపడక తప్పదు. మన రాష్ట్ర వాటా అయిన 377.7 టిఎంసిల నీటిని 'అప్పటికే నెలకొని వున్న హక్కు' అనే పేరు మీద కొనసాగించకుండా అందులో మూడవ వంతు (అంటే 126 టిఎంసిలు) తగ్గించివున్నా పై అయిదు జిల్లాలలోని శ్రీశైలం ఎడమ కాలువ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, హంద్రీ-నీవా, గాలేరు-నగరి మొదలయిన పేరుతో చలామణి అవుతున్న ప్రాజెక్టులకు సగం నీటి కేటాయింపయినా - 'నికర జలాల' కేటాయింపు - సాధ్యం అయివుండేది. ఆ ప్రాజెక్టులకు అనుమతి లభించేది. మూడవ వంతు కాక సగం తగ్గించివుంటే ఈ కరవు జిల్లాల ప్రజలు కలలుగంటున్న మేరకు ప్రాజెక్టులు 'నికరజలాల' కేటాయింపుతో కట్టి వుండవచ్చు. దీనివల్ల కోస్తా జిల్లాలకు కృష్ణా జలాలు దక్కకుండపోవు. ఇప్పుడు దక్కేటంత పుష్కలంగా దక్కకపోవచ్చునంతే.

అయితే 'నికర జలాలు - మిగులు జలాలు' అనే వర్గీకరణే అనవసరం అని పైన చెప్పుకున్నాము కాబట్టి అక్కడి కేటాయింపులు తీసి ఇక్కడ చేర్చడం వంటి కసరత్తులక్కరలేదు. మరయితే ఏం చేయాలి?

కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని కరవు ప్రాంతాలు ఆ నది నుండి ఎంత నీరు కోరుకుంటున్నదీ ఇప్పటికే అంచనాకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ తెలంగాణా, రాయలసీమ జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్రలోని వీటి పొరుగు జిల్లాలు - ఒక్కమాటలో చెప్పాలంటే దక్కన్ పీఠభూమి ప్రాంతం - వర్షపాతం తక్కువ వున్న ప్రాంతం. ఈ ప్రాంతంలో ఇప్పటికే కృష్ణానది మీద నిర్మించిన ప్రాజెక్టులున్నాయి. కాగా మరికొన్ని ప్రాజెక్టుల ప్రతిపాదన కూడ జరిగింది. అయితే

'నికర జలాలు' లేవు అన్న కారణంగా ఇవి ఆమోదం పొందలేదు.

ఇప్పుడు జరగవలసింది పాత ప్రాజెక్టులనూ ప్రతిపాదిత ప్రాజెక్టులనూ కలిపి ప్రాధాన్యతల ప్రాతిపదికన ఒక జాబితా తయారు చేయడం. వర్షపాతం, భూగర్భ జలాలు, భూసారం అనుకూలంగా వున్న ప్రాంతాలకు నీరిచ్చే ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత. అవి మెరుగుగా వుండేకొద్దీ తక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఒక ఉమ్మడి జాబితా మూడు రాష్ట్రాలూ తయారుచేయాలి. అవసరమయితే ఈ మూడు రాష్ట్రాలకూ చెందని నిపుణుల సహాయం తీసుకొని ఈ ప్రాధాన్యతలు నిర్ణయించాలి.

అందరి కోరికలు కలుపుకుంటే నదిలో '75 శాతం లభ్యత' ప్రాతిపదికన కాదుసరికదా, '10 శాతం లభ్యత' ప్రాతిపదికన కూడ దొరకనంత నీరు అవసరమవుతుందేమోనని అనుమానం రావచ్చు. ఎవరి అవసరాలను వారు ఇతరుల అవసరాలతో నిమిత్తం లేకుండ ప్రతిపాదిస్తున్నారు కాబట్టి ఈ అనుమానం నిజమైనా ఆశ్చర్యమేం లేదు. అప్పుడు అన్ని ప్రాజెక్టుల ప్రణాళికలను (కొత్తవే కాదు, పాతవి కూడ) తీసుకొని వాటి ఆయకట్టును ఒకే దామాషాలో (లేదా పైన పేర్కొన్న మూడు ప్రమాణాలు నిర్దేశించే దామాషాలో) తగ్గించాలి.

ప్రాధాన్యతల ప్రాతిపదికన ప్రాజెక్టుల జాబితా తయారుచేసుకున్న తరువాత ఇప్పుడు ప్రతిపాదనలో వున్న అన్ని ప్రాజెక్టుల్ని కట్టేసుకోవాలి. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో నదిలోకి మొదటవచ్చి చేరే నీటిని మొదటి ప్రాధాన్యతగల ప్రాజెక్టులలోకి మొదట పారించాలి. తక్కువ ప్రాధాన్యతగల ప్రాజెక్టు నదిపైభాగాన వుంటే దాని గేట్లు తెరచి నీటిని కిందికి పోనివ్వాలి. ఆ తరువాత నదిలోకి వచ్చిన నీరు రెండవ ప్రాధాన్యతగల ప్రాజెక్టులలోకి, ఆ తరువాత మూడవ ప్రాధాన్యతగల ప్రాజెక్టులలోకి... ఈవిధంగా 'నికరం' 'మిగులు' అన్న మీమాంస లేకుండ మొత్తంగా నదీ జలాలను వాడుకోవచ్చు.

## 3. రాష్ట్రాల మధ్య సమస్యగా చూడడం

ఇది పరీవాహక రాష్ట్రాల మధ్య సమస్యకాదనీ, నది నీటి అవసరం ఎక్కువ వున్న ప్రాంతాలకూ తక్కువ వున్న ప్రాంతాలకూ మధ్య వున్న సమస్య అనీ ఈపాటికి అర్థమయ్యే వుంటుంది. 'ఆల్మట్టి' గురించి జరిగిన గొడవలో సర్కార్ జిల్లాల నాయకులూ మేధావులూ రాయలసీమవాసులను తమకంటె పెద్దగా బాగుపడని ప్రాంతంకాని బిజాపూర్‌వాసులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టిన వైనం చూశాము. ఇది అర్థరహితమైన భాషా భేదం. కృష్ణానది ఒకచోట మరాఠీ, ఒకచోట కన్నడం, ఒకచోట తెలుగు మాట్లాడదు. అవసరాన్ని బట్టి నీటి వాడకం వుండాలనుకున్నట్టయితే అనంతపురం వాసులకు బిజాపూర్ వాసులుతోనే పోలికతప్ప కృష్ణా జిల్లావారితో కాదు.

రేపు జరగవలసిన చర్చలు, మళ్లీ ఆ నది నీటిని మూడు రాష్ట్రాలూ ఎంతెంత తీసుకోవాలని కాదు. ఈసారి చర్చలు జరగవలసింది (1) ప్రాజెక్టుల ప్రాధాన్యతలను హేతుబద్ధంగా నిర్ణయించుకొని అందరూ అంగీకరించే ప్రాధాన్యతల జాబితా తయారు చేసుకోవడానికి (2) అన్ని (ఉనికిలో వున్న, ప్రతిపాదనలో వున్న) ప్రాజెక్టుల నీటి పరిమాణాలూ కలుపుకుంటే నదిలో అసలే నీరు దొరకనంత అయ్యేటట్టయితే అన్నిటి ఆయకట్లనూ తగిన దామాషాలో తగ్గించుకోవడానికి, (3) ఈ ఒప్పందం అమలును పర్యవేక్షించే 'రివర్ వ్యాలీ అథారిటీ'ని ఏర్పాటు చేసుకోవడానికి

జరగాలి.

ఈ చర్చలలో ఈ మూడు రాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధులేకాక, ప్రాజెక్టుల ఆయకట్టుదార్ల ప్రతినిధులు కూడ (ఉన్న ప్రాజెక్టులే కాక ప్రతిపాదిత ప్రాజెక్టులకు సంబంధించినవారు కూడ) పాల్గొనవలసి వుంటుంది. ప్రాంతీయ విభేదాలు, వివక్ష తీవ్రంగా వున్న ప్రస్తుత పరిస్థితులలో 'ప్రభుత్వమే రాష్ట్రంలోని ప్రజలందరి ప్రతినిధి' అని గుడ్డిగా విశ్వసించజాలము. ఆయకట్టుదార్ల ప్రతినిధులను ఏవిధంగా ఎంపిక చేసుకుంటామనేది ప్రస్తుతానికి అనవసరం. వారి గొంతుక కూడ చర్చలలో వినిపించాలని మాత్రం నొక్కి చెప్పాలి.

అయితే ఒక ఒప్పందానికి వచ్చిన తరువాత దానిని మూడు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య ఒప్పందంగా రాసుకొని మూడు రాష్ట్రాల ప్రతినిధులూ సంతకం చేయాలి. అప్పుడే అది చట్టబద్ధం అవుతుంది. అంటే ఎవరైనా అతిక్రమిస్తే సుప్రీంకోర్టు ద్వారా దానిని అమలు చేయించుకోవడం సాధ్యం అవుతుంది.

రాయలసీమ, దక్షిణ తెలంగాణా జిల్లాలకే కాక, కర్ణాటక, మహారాష్ట్రలలో కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని కరువు జిల్లాలకు కూడ న్యాయం చేయగల మార్గం ఇదొక్కటే. సర్కారు జిల్లాలకు నీరిచ్చే నాగార్జునసాగర్, కృష్ణా డెల్టా వర్క్సుకు ఆఖరి ప్రాధాన్యత లభిస్తుంది కాబట్టి వారు ఇప్పుడు వాడుతున్నంతగా కృష్ణా జలాలను వాడుకోలేరు. వారికి ఎంత దక్కుతుందన్న విషయంలో గ్యారంటీ కూడ ఇప్పుడున్నంత వుండదు. '75 శాతం లభ్యత' స్థానంలో తీవ్రదుర్భిక్ష ప్రాంతాల ప్రాజెక్టులకు బహుశా 90 శాతం లభ్యత, కృష్ణా డెల్టా వర్క్సుకు 50 శాతం కంటె తక్కువ లభ్యత వుండొచ్చు. అంటే వారు వర్షపాతాన్నీ బావినీటినీ అప్పుడప్పుడు ఎంతో కొంత దొరికే కృష్ణా జలాలనూ సమన్వయపరచుకునే రీతిలో పంట విధానాన్ని మార్చుకోవలసి వుంటుంది.

## ముగింపు

ఈ రూపంలో కృష్ణా జలాల గురించి కొత్తగా చర్చలు జరపవలసిన అవసరాన్ని మనం గుర్తించాలి. మన రాష్ట్ర ప్రభుత్వంపైన, కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాల పైన ఒత్తిడి పెట్టడానికికొక ఉద్యమం నిర్మించాలి. ఆ రెండు రాష్ట్రాలూ దీనికి సులభంగానే ఒప్పుకోవచ్చు. మన రాష్ట్రంలోని బలమైన రాజకీయ శక్తులను ఏవిధంగా ఒప్పిస్తామన్నది మన ముందున్న ప్రశ్న.

ఈ ప్రయత్నానికి ప్రజాతంత్ర శక్తులంతా నడుంకట్టాలని కోరుకుంటూ-

మానవ హక్కుల వేదిక (HRF)

20.4.2001

(ఈ డాక్యుమెంట్ ఆధారంగా అనంతపురం, కడప, కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో చర్చలు జరిగాక 27.1.2002న గద్వాలలో కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం ఏర్పడింది.)

❋